సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



బంగారం అధరహో
బంగారం ధరలు అదరహో అనిపిస్తున్నాయి. పెట్టుబడి పెట్టిన వారికి శుభ పరిమాణం కాగా సామాన్యుడికి మాత్రం ఆర్థిక భారంగా మారుతుంది. 8లో ▸



'పట్టిసం'లో ఏర్పాట్లపై సమీక్ష
పట్టిసంలో మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా పోలీసులు పనిచేయాలని ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశించారు. 8లో ▸



కాలువల్లో కోళ్ల మూటలు
వైరస్‌తో చనిపోయిన కోళ్లను పెద్ద సంఖ్యలో పంట, మురుగు కాలువల్లో వేస్తున్నారు. దీని వల్ల ఆక్వాకు తీవ్రమైన నష్టం ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸

సిండికేటుకి ఫుల్ కిక్కు

- మద్యం అమ్మకాలపై మార్జిన్ 10 నుంచి 14 శాతానికి పెంపు
- 15 శాతం పెరిగిన మద్యం ధరలు
- రోజుకు రూ. 52.5 లక్షల అదనపు భారం
- గతంలో ప్రభుత్వ ఖజానాకు చేరిన మద్యం ఆదాయం
- నేడు కూటమి నేతలు, సిండికేట్ జేబుల్లోకి



భీమవరంలోని ఒక మద్యం షాపు వద్ద ఖాళీ మద్యం బాటిల్స్ పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

సాక్షి, భీమవరం: మద్యం ఆదాయాన్ని తమ్ముళ్ల పరం చేసిన చంద్రబాబు సర్కారు మందుబాబుల జేబులు గుల్ల చేసి వారికి మరింత మేలు చేసే ఎత్తుగడ వేసింది. అమ్మకాలపై ప్రస్తుతం లిక్కర్ వ్యాపారులకు ఇస్తున్న 10 శాతం మార్జిన్‌ను 14 శాతంకు పెంచింది. ఆ మేరకు మద్యం ధరలను 15 శాతం వరకు పెంచింది. గత టీడీపీ హయాంలో వేళాపాలా లేకుండా విచ్చలవిడిగా సాగిన మద్యం అమ్మకాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కళ్లెం వేసింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం అమ్మకాలు చేపట్టింది. బెల్టుషాపులు అరికట్టడంతో పాటు నిర్ణీత వేళల్లో మాత్రమే అమ్మకాలు చేసేవారు. షాపుల వద్ద కొనుగోలు చేసి తీసుకెళ్లిపోవడమే తప్ప తాగేందుకు వీలు లేకుండా చేశారు. షాపుల నిర్వహణ ప్రభుత్వ అధీనంలో ఉండటంతో మద్యం ఆదాయం పూర్తిగా ప్రభుత్వ ఖజానాకు చేరేది. కూటమి ప్రభుత్వం మద్యాన్ని మళ్లీ ప్రైవేట్ పరం చేస్తూ పాత విధానాన్ని తెరపైకి తెచ్చింది. 175 మద్యం దుకాణాలకు స్థానిక ఎమ్మెల్యేల కనుసన్నల్లోని కూటమి సిండికేటుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి.

బార్‌లో సిట్టింగ్ ఏర్పాట్లు

గత ప్రభుత్వంలో ఊరికి దూరంగా ఎక్కడ ఉన్నాయో తెలీని మద్యం షాపులను లిక్కర్ సిండికేట్లు జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లోకి తెచ్చేశారు. బార్ అండ్ రెస్టారెంట్లను తలపించేలా షాపుల వద్దనే కూర్చుని తాగేందుకు టేబుళ్లు, కుర్చీలతో సిట్టింగ్ ఏర్పాట్లు చేశారు. మందులోకి మంచింగ్, ఫాస్ట్‌ఫుడ్స్‌ను అందిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా ఈ నెల 1న భీమవరంలోని పలు వైన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీల సందర్భంగా మద్యం పాలసీకి విరుద్ధంగా సిట్టింగ్ ఏర్పాట్లు, లూజ్ సేల్స్ చేస్తుండటాన్ని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి గుర్తించారు. షాపుల వద్ద గుట్టలుగా ఖాళీ మద్యం బాటిల్స్ పడి ఉండటం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయా షాపులపై కేసుల నమోదుకు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మళ్లీ తనిఖీ చేస్తానని సిట్టింగ్ ఏర్పాట్లు, లూజ్ సేల్స్ ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించి వెళ్లినా సిండికేటు పట్టించుకోలేదు. జేసీ ఆదేశాలు బేఖాతరు చేయడంపై మీడియాలో కథనాలు రావడంతో రెండుమూడు రోజులు సిట్టింగ్ క్లోజ్ చేశారు. తర్వాత షరామామూలే అన్నట్టుగా భీమవరంలోని సిండికేట్ వర్గాల తీరు ఉంది. మరోపక్క జిల్లా వ్యాప్తంగా ఒక్కో షాపు పరిధిలో రెండు నుంచి ఐదు వరకు బెల్టులు తెరిచి అమ్మకాలు చేయిస్తున్నారు. మద్యం పాలసీ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నా మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

తక్కువ ధరకు నాణ్యమైన మద్యం ఇస్తామని పాలన చేపట్టిన తొలినాళ్లలో చెప్పిన చంద్రబాబు తొమ్మిది నెలలు తిరక్కుండానే మందుబాబులకు చుక్కలు చూపిస్తున్నారు. లిక్కర్ సిండికేటుకు మేలు చేసేలా అమ్మకాలపై ప్రస్తుతం 10 శాతంగా ఉన్న మార్జిన్‌ను 14 శాతంకు పెంచారు. ఈ మేరకు వ్యాపారుల లాభం పెరిగింది. అందుకోసం మద్యం ధరలను 15 శాతం పెంచారు. గత ప్రభుత్వంలో మద్యంపై వచ్చే ఆదాయం మొత్తం ప్రభుత్వ ఖజానాకు చేరితే

రోజుకు రూ.52.5 లక్షల భారం

ఇప్పుడు కూటమి నేతలు, సిండికేటు జేబుల్లోకి వెళ్లడం గమనార్హం. జిల్లాలో రోజుకు సుమారు 3.5 కోట్ల మద్యం వినియోగం జరుగుతుండగా రూ.52.5 లక్షల వరకు వినియోగదారులపై పెరిగిన ధరల భారం పడుతోంది. మద్యం సేవించే వారిలో అధికశాతం పేద, మధ్యతరగతి వర్గాల వారే కాగా వారే ఎక్కువగా నష్టపోవాల్సి వస్తుంది. రూ. 99 చీఫ్ లిక్కర్ బ్రాండ్లతో పోలిస్తే దిగువ మధ్యతరగతి వర్గాల వారు ఎక్కువగా రూ.120 ఓఏబీ, రూ.130 మంజీర, హెచ్‌డీ, రూ.150 క్లాసిక్ బ్లూ, ఏసీ బ్లాక్, పార్టీ స్పెషల్, సిల్వర్ బ్రాండ్లు, మధ్యతరగతి వర్గాల వారు రూ.180 ఎంసీ, ఐబీ, ఐకానిక్ వైట్, ఆఫ్టర్ డార్క్, రూ.190 ఎంహెచ్ బ్రాంది, రూ.230 8 పీఎం తదితర క్వార్టర్ బాటిల్స్ కొనుగోళ్లు చేస్తుంటారు. ప్రస్తుత ధరపై బాటిల్‌కు రూ.10 పెంచి అమ్మకాలు చేస్తున్నారు.



వదంతులు నమ్మొద్దు

శాస్త్రీయ పద్ధతిలో కోళ్ల ఖననం

భీమవరం (ప్రకాశంచౌక్): చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేస్తున్నామని, ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననాన్ని పశు వైద్యులు, సహాయక సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వేల్పూరుకు కిలోమీటర్ దూరంలోని ప్రాంతం అలర్ట్ జోన్‌గా ప్రకటించి అప్రమత్తం చేశామన్నారు. పోలీసు, రెవెన్యూ, అటవీ, పశు సంవర్ధక తదితర శాఖలతో 20 ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ గ్రామాలకు చుట్టుపక్కల 10 కిలోమీటర్ల ప్రాంతంలో కోళ్లు, కోళ్ళ ఉత్పత్తుల రాకపోకలను కట్టడి చేశామన్నారు. కొల్లేరు పరివాహక ప్రాంతంలో ఈ వ్యాధి ప్రబలకుండా పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. అలర్ట్ జోన్ ప్రాంతంలో మినహా, మిగిలిన ప్రాంతాలలో ఉడకబెట్టిన గుడ్లు, మాంసాన్ని నిర్భయంగా వినియోగించవచ్చని స్పష్టం చేశారు. రెడ్ జోన్‌లో 2 చెక్‌పోస్టులు, ఆరెంజ్ జోన్‌లో 4 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

న్యూస్‌రీల్

మోషేనురాజును కలిసిన వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు



భీమవరంలో మోషేనురాజును కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయలక్ష్మి

భీమవరం: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన కోడె విజయలక్ష్మి బుధవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో మోషేనురాజును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీ పటిష్టానికి కృషిచేస్తానని కార్యకర్తలందరికీ అండగా ఉంటానన్నారు. పార్టీ మహిళా అధ్యక్షురాలిగా నియమించిన పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, మాజీ అధ్యక్షుడు కోడే యుగంధర్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ



జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: నేరాల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణతో ప్రణాళికా బద్ధమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పోలీస్ అధికారులంతా సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణాన్ని నెలకొల్పేలా కృషి చేయాలన్నారు. కేసులను ఛేదించడానికి, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే సూచనలు, మెలకువలను తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ పెంచితే నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సులువవుతాయని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం డీఎస్పీలు రావూరి గణేష్ జయసూర్య, జి.శ్రీవేద, డి.విశ్వనాథ్, పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



పోలవరం ఎంపీపీ కార్యాలయం వద్ద తనిఖీలు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందం క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టుతో పాటు, పోలవరంలోని ప్రభుత్వ కార్యాలయాలను కూడా తనిఖీ చేస్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్, ఆసుపత్రి ప్రాంతాల్లో బుధవారం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ అధికారి ఆధ్వర్యంలో బుధవారం భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నర్సాపురం డిపోల నుంచి ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్, భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పనిదినాలు కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ ఉపాధి హామీ పథకంలో పని అడిగిన ప్రతిఒక్కరికీ పనిదినాలు కల్పించాలని కలెక్టరు నాగరాణి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ పనులు, చిన్నపిల్లలకు ఆధార్ నమోదు, హౌస్ హోల్డ్ డేటా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

నారసింహునికి చందనోత్సవం





ఉగ్రనారసింహుడికి హారతులిస్తున్న ఆలయ ప్రధానార్చకుడు, దర్శనానికి క్యూలైన్ల ద్వారా వెళ్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామికి చందనోత్సవాన్ని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకతో ఉగ్ర రూపంలో ఉన్న నారసింహుడు చందనలేపంతో సేదతీరారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినం నాడు ప్రారంభమైన స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున ఆలయంలో నిత్యహోమాలు, మూలమంత్ర హవనాలు జరిగాయి. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలను ఆలయ అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ఆ తరువాత స్వామి మూలవిరాట్‌కు చందన మహోత్సవాన్ని వేద మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. ఉగ్రరూపంలో ఉండే లక్ష్మీనారసింహుడిని శాంతింపజేసే క్రమంలో జరిగిన ఈ ఉత్సవాన్ని వీక్షించిన భక్తులు పరవశించారు. పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, నీరు, తేనెతో ముందుగా స్వామిని అభిషేకించారు. మహా పూర్ణాహుతి, కలశోద్వాసన, అవభృదం, ధ్వజ అవరోహణ కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. పెద్ద ఎత్తున మహిళా భక్తులు సుందరగిరిపై పాల పొంగళ్లను వండి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. గురువారం స్వామివారికి జరిగే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఆలయ ప్రధానార్చకులు కోడూరి ఈశ్వర్‌కుమార్ శర్మ తెలిపారు.

ఉపాధ్యాయుడి తీరుపై విచారణ

పెనుగొండ: దేవలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుడు వ్యవహార శైలిపై ఫిర్యాదు అందడంతో అధికారులు బుధవారం విచారణ నిర్వహించారు. విద్యార్థినులు పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ విద్యార్థి సంఘం ఫిర్యాదు చేసింది. దీంతో నరసాపురం డివిజన్ విద్యాశాఖాధికారి డి.మురళీ సత్యనారాయణ, పెనుగొండ సీఐ రాయుడు విజయ్‌కుమార్, ఆచంట ఎస్సై వెంకటరమణలు విచారించారు. ఉపాధ్యాయుడి దురుసు ప్రవర్తన వల్లే ఆరోపణలు వస్తున్నాయని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రవర్తన మార్చుకోమని హెచ్చరించి రాత పూర్వకంగా తీసుకున్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికులను నమోదు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు, కార్మిక బోర్డు సభ్యత్వం నమోదు తదితర అంశాలపై కార్మిక శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇంతవరకు జిల్లాలో 4.5 లక్షల మంది కార్మికులు నమోదు చేసుకున్నారని, మార్చి 31 నాటికి మరో ఐదు లక్షల కార్మికుల నమోదుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లా కార్మికశాఖ అధికారి డా.ఆకన లక్ష్మీ, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఎల్‌డీవో వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్. కేసీహెచ్ అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలించాలి : వెట్టి చాకిరీని నిర్మూలించి ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వెట్టిచాకిరి నిర్మూలనపై గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా వెట్టిచాకిరి కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 5,427 మంది హాజరు

భీమవరం: ఇంటర్ ప్రాక్టికల్స్‌కు బుధవారం 5,427 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు చెప్పారు. ఉదయం 2,992 మందికి 2,890 మంది హాజరు కాగా మధ్యాహ్నం పరీక్షకు 2,610 మందికి 2,537 మంది హాజరయ్యారు.

పోలింగ్ విధులు బాధ్యతగా నిర్వర్తించాలి



పీవో, ఏపీవోల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌వో, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను బాధ్యతగా స్వీకరించి నిష్పక్షపాతంగా పనిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి పోలింగ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికలపై పీఓలు, ఏపీఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వెట్రిసెల్వి, ఎన్నికల పరిశీలకురాలు కె. సునీత, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 3,14,984 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో 62 పోలింగ్ కేంద్రాల్లో 42,282 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 24,704 మంది, మహిళలు 17,571 మంది, ట్రాన్స్‌జెండర్లు ఏడుగురు ఉన్నారని తెలిపారు. పోలింగ్ ముందురోజు ఏలూరులో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని అందజేస్తామని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం బ్యాలెట్ బాక్సులు పోలింగ్ సామగ్రితో సహా ఏలూరులో ఉన్న స్ట్రాంగ్ రూంకి జాగ్రత్తగా చేర్చాలన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన మొదటి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ఆమె పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల ఉపసంహరణ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా నేడు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం జరగనుంది. ఇంతవరకు 54 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా, 11 మంది నామినేషన్లు తిరస్కరించారు. గురువారం సాయంత్రం తుది జాబితా అందనుంది. 27 న పోలింగ్ నిర్వహించనుండగా, మొత్తం 3,14,984 అభ్యర్థులు ఓటు హక్కును వినియోగించనున్నారు.

చింతమనేని వేధింపులు తాళలేక నామినేషన్

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గం శ్రీపర్రు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రేవులగడ్డ ముకేష్ బాబు పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉన్నారు. ఈ నెల 10న **నామినేషన్ పత్రాలు** అందించారు. దెందులూరు **నియోజకవర్గంలో నాయకుల** వేధింపులకు గురవుతున్న **ఎందరో టీడీపీ కార్యకర్తలు** తన విజయానికి సహకారం **అందిస్తారన్నారు. తన** తండ్రి గోవర్ధన్‌తో కలిసి **గత ఎన్నికల్లో తెలుగుదేశం** పార్టీ విజయానికి కృషి **చేశానని గుర్తు చేసారు.** అయినప్పటికీ ఎమ్మెల్యే **చింతమనేని ప్రభాకర్,** కొందరు నాయకులు తమ కుటుంబాన్ని వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిష్ఠానం సైతం పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఇదేం ఖర్మ!



కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి గండి పడుతోంది. ఇప్పటికే అనేక పథకాలు నిర్వీర్యం చేయగా, పింఛన్లకు కత్తెర వేస్తూ వారికి కన్నీటిని మిగులుస్తున్నారు. ఇప్పటికే చాలా మంది అర్హులు పింఛన్లు కోల్పోగా, మరికొందరు పింఛన్‌లు కోల్పోయే పరిస్థితిని తీసుకువస్తున్నారు. పక్షవాతంతో నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తులకు స్థానికంగా సదరం సర్టిఫికెట్ ఇస్తే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఏలూరు జీజీహెచ్ ఏర్పాటు చేసిన సదరం క్యాంప్ ఇందుకు విరుద్ధంగా తయారైంది. ఇక్కడ పరీక్షించి సర్టిఫికెట్‌లు మంజూరు చేయాల్సింది పోయి, విజయవాడ రిఫర్ చేస్తున్నారు. దీంతో లేవలేని, సరిగా నడవలేని వ్యాధిగ్రస్తులు వేరొకరి సాయంతో కష్టపడి ఆసుపత్రికి వస్తే వేరే చోటకు రిఫర్ చేయడం పట్ల అసహనం వ్యక్తంచేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



వైద్య పరీక్షలకు బారులు తీరిన పింఛనుదారులు



నిలబడలేక నేలపై కూర్చొన్న పింఛనుదారులు



కూతురిని సదరం క్యాంపునకు తీసుకువస్తున్న తండ్రి

క్లుప్తంగా

తిరుమల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

భీమవరం : జేఈఈ మెయిన్స్‌లో భీమవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని స్కూల్ డైరెక్టర్స్ ఎస్.సాయిరాజు, పి శ్రీనివాసవర్మ, జి సతీష్‌బాబు తెలిపారు. పీజె హర్షవర్ధన్ 99.76 శాతం సాధించగా ఎ శివకార్తీక్, జి నిఖిల్‌వర్మ, కె శివ, వీఎల్ ఎస్‌కే కార్తీక్, జీజీఎస్ఎం శ్రీవెంకట్, ఎం సాయిచరణ్ 99 శాతంకి పైగా సాధించారన్నారు. అలాగే 105 మంది విద్యార్థులు 90 శాతం పైగా సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం కళాశాలలో అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన 'శశి'



విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

తణుకు అర్బన్ : తణుకు శశి జూనియర్ కళాశాల విద్యార్థులు 2025 జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచినట్లు సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కూడవల్లి నాగ రామ్‌చరణ్ తేజ్ 99.24 శాతంతో ప్రథమస్థానం, పాలకుర్తి అక్షయ్ 99.05 శాతంతో ద్వితీయ, గుడివాడ శ్రీతన్‌గుప్త 98.74 శాతంతో తృతీయ, టి.దత్తాత్రేయ 95.8, చంద్రు నేహశ్రీ 95.75, ఎస్.రవి వెంకట వివేక్ 95.69, ఎ.హర్షవర్ధన్ 95.63, వై.మనోజ్ఞ 95.49, కొవ్వూరి శ్రీవల్లి 95.31 శాతం సాధించినట్లు వివరించారు. విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, కళాశాల ప్రిన్సిపాల్ నల్లూరి రాఘవేంద్ర రావు, వైస్ ప్రిన్సిపాల్ వెలగల సత్యనారాయణ రెడ్డి, తణుకు క్యాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

సరికొత్త విధానాలతో కెనరా బ్యాంక్ సేవలు



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న బ్యాంక్ అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఖాతాదారుల అవసరాలకి తగ్గట్టుగా సరికొత్త విధానాలను అవలంబిస్తూ సేవలు అందిస్తున్నామని కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ తోట రవిచంద్ర అన్నారు. బుధవారం భీమవరంలో భీమవరం రీజియన్ డిపాజిటర్స్‌తో కెనరా క్రెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ నలుగురు ఉద్యోగులతో మొదలైన బ్యాంకు ప్రస్తుతం 83 వేల మందితో రూ.24 లక్షల కోట్ల వ్యాపారంతో 3వ అతి పెద్ద జాతీయ బ్యాంకుగా ఉందన్నారు. వినియోగదారుల సేవలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, దీనిలో భాగంగా కెనరా క్రెస్ట్ ప్రొడక్ట్‌ను ప్రారంభించామన్నారు. విజయవాడ సర్కిల్ హెడ్ విజయలక్ష్మి మాట్లాడుతూ వినియోగదారులకి మరింత చేరువకావడానికి త్వరలో నూతన శాఖలు ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఆనంద విశ్వనాథరాజు, తోట జగదీశ్, తణుకు మాంటిస్సోరి అనపర్తి ప్రకాశరావు, ఏఎస్ రాజు, ఆళ్ల సతీష్ చౌదరి, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

బంగారం అధరహో

- రోజురోజుకు బంగారం ధర పైపైకి
- 50 శాతం మేర పడిన కొనుగోళ్లు
- సురక్షిత పెట్టుబడిగా బంగారం



భీమవరంలో ఓ బంగారం షాపులో ఇలా

భీమవరానికి చెందిన నాని అనే యువకుడు 2023 ఫిబ్రవరిలో 22 క్యారెట్ల బంగారం గ్రాము రూ.5,250 ఉండగా రెండు కాసులు ఉన్న వస్తువును జీఎస్‌టి, తరుగుతో కలిసి రూ.92 వేలకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం దాని ధర రూ.1,28,160కు చేరింది. మంచి లాభం వచ్చే పెట్టుబడిగా బంగారం సత్తా చాటిందని చెప్పడానికి ఇదో నిదర్శనం.

భీమవరం (ప్రకాశం చౌక్) : రోజురోజుకు బంగారం ధరలు అదరహో అనిపిస్తున్నాయి. అయితే ఇది బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి శుభపరిణామం కాగా సామాన్యుడికి మాత్రం ఆర్థిక భారంగా మారుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి బంగారం ధర మరింత వేగంగా పెరిగి మంగళవారం నాటికి 22 క్యారెట్ల బంగారం గ్రాము రూ.8010, 24 క్యారెట్ల బంగారం గ్రాము రూ.8,792 చేరింది. గడిచిన మూడేళ్లలో ఏడాదికి సుమారు 10 గ్రాముల బంగారం ధర రూ 8 నుంచి 10 వేలు వరకూ పెరిగింది.

సామాన్యుడిపై ఆర్థిక భారం

బంగారం కొనుగోళ్లు పేద, మధ్యతరగతి వారికి ఆర్థిక భారంగా మారాయి. ముఖ్యంగా పెళ్లిళ్లలో బంగారం ప్రధాన పాత్ర వహించడంతో ఆడపిల్లల కుటుంబ సభ్యులు పెరిగిన బంగారం ధరంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు, తిరిగి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు పెళ్లిళ్లు ఉన్న నేపథ్యంలో రోజు రోజుకు పెరుగుతున్న బంగారం ధర చూసి హడలిపోతున్నారు.

గడిచిన మూడేళ్లలో ఫిబ్రవరిలో బంగారం ధరలు ఇలా

ఏడాది	22 క్యారెట్ల 10 గ్రాములు	24 క్యారెట్ల 10 గ్రాములు
2022	46,112	50,190
2023	53,750	58,380
2024	58,875	63,435
2025	81,250	88,765

పడిపోయిన కొనుగోళ్లు

వేగంగా పెరుగుతున్న బంగారం ధర వల్ల బంగారం కొనుగోళ్లు 50 శాతం మేర పడిపోయాయని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో నర్సాపురం, భీమవరంలో ఎక్కువ మొత్తంలో బంగారంపై వ్యాపారం జరుగుతుంది. గతేడాది మే నెలకు ముందు రోజుకు జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్లు బంగారంపై వ్యాపారం జరిగితే నేడు జిల్లా వ్యాప్తంగా కేవలం రూ.5 కోట్లు వ్యాపారాలావాదేవీలు జరుగుతున్నాయి.

పెట్టుబడిదారులకు మంచి లాభాలు

బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి పెరుగుతున్న ధరలు మంచి లాభాలు తెస్తున్నాయి. బంగారంపై పెట్టుబడి సురక్షిత పెట్టుబడిగా ఉండడంతో సాధారణ ఉద్యోగి దగ్గర నుంచి వ్యాపారస్తులు వరకు బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. గడిచిన మూడేళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టినవారికి నేటి బంగారం ధరతో పోల్చుకుంటే రూపాయన్నర నుంచి మూడు రూపాయల వడ్డీ వచ్చింది.

పెరుగుదలకు కారణం

బంగారం పెరుగుదలకు బుల్లియన్ వ్యాపారుల చెబుతున్న కారణాలు ఇలా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరగడం, డాలర్ విలువ రూ.84 నుంచి రూ.87 వరకు పెరగడం, ఇతర రంగాల్లో నష్టాలు రావడంతో సేఫ్టీగా భావించి బంగారం కొనుగోళ్లు పెంచడం, ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల వల్ల బంగారం ధరలు పెరుగుతున్నాయి.

కొనుగోళ్లు 50 శాతం తగ్గాయి



బంగారం కొనుగోళ్లు 50 శాతం మేర తగ్గాయి. రెండు నెలల నుంచి ధర వేగంగా పెరుతుండడంతో ఆ ప్రభావం కొనుగోళ్లపై చూపిస్తుంది. పెళ్లిళ్లు ఉన్నవారు, తప్పని పరిస్థితిల్లో కొనుగోలు చేయాల్సిన వారు మాత్రమే బంగారం కొంటున్నారు.

– కోట్ల నాగేశ్వరరావు
భీమవరం బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు

ధరలు వేగంగా పెరుగుతున్నాయి



ఈ రెండు నెలల నుంచి ధరలు వేగంగా పెరుగుతున్నాయి. మంగళవారం నాటికి 22 క్యారెట్ల బంగారం గ్రాము రూ.8010, 24 క్యారెట్ల బంగారం గ్రాము రూ.8,792గా ఉంది. అమెరికా విధివిధానాలు, బంగారంపై విరివిగా పెట్టుబడులు ధర పెరుగుదలకు కారణం.

– కార్మూరి సత్యనారాయణమూర్తి,
బులియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

లైసెన్స్ లేని చేపల మేతల దుకాణాల సీజ్



చినఅమిరంలో శ్రీ శివసాయి ఆక్వా ఫీడ్స్ షాపులో చేపల మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

భీమవరం అర్బన్ : ఫిషరీస్ లైసెన్స్‌లు లేకుండా చేపలు, రొయ్యల మేతలు, మందులు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు పి.శివరామకృష్ణ, డి.ప్రసాద్ కుమార్ అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరం గ్రామంలో విజిలెన్స్, మత్స్యశాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో రొయ్యలు మేతలు, మందులు విక్రయిస్తున్న షాపులపై దాడులు చేశారు. శ్రీ శివసాయి ఆక్వా ఫీడ్స్ లైసెన్స్ లేకుండా రూ.కోటి 88 లక్షల 97వేల 176 విలువ చేసే 180.925 టన్నుల చేపల మేతలు, మందులు, శ్రీ సాయి పవన్ ఆక్వా ఫీడ్స్ నందు రూ.31 లక్షల 96 వేల 237 విలువ చేసే 19.269 టన్నుల చేపలు మేతలు, మందులను సీజ్ చేశారు. ఆ షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, మత్స్యశాఖ ఏడీ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీవో పి.లావణ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బధిరుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం : స్థానిక డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో జిల్లా స్పోర్ట్స్ పెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి బధిరుల (మూగ చెముడు) టీ20 క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సీహెచ్ తాతారావు మాట్లాడుతూ 9 జిల్లాల నుంచి 50 మంది బధిర క్రీడాకారులు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలను మూడు డివిజన్లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు గురువారం బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా క్రికెట్ కిట్ అందజేశారు. డీఎన్నార్ కళాశాల పాలకవర్గ సభ్యుడు కూనపరాజు రామకృష్ణంరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'పట్టిసం'లో ఏర్పాట్లు పక్కాగా ఉండాలి



పట్టిసం శివక్షేత్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

పోలవరం రూరల్ : మహాశివరాత్రి ఉత్సవాలు సమయంలో ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా దైవ దర్శనం చేసుకుని వచ్చే విధంగా పోలీసు యంత్రాంగం పనిచేయాలని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశించారు. ఆయన బుధవారం సాయంత్రం ఉత్సవ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులు గోదావరి నది దాటి వెళ్లేందుకు ఏర్పాటు చేసే పంట్లు ప్రదేశాన్ని, టిక్కెట్ కౌంట్‌లు, క్యూలైన్‌లు, ర్యాంపులు ప్రదేశాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రోడ్డుపై ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఎవరూ స్నానాలు చేయకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. పంట్లు నిర్మాణం పటిష్టంగా ఉండాలని, శివక్షేత్రం, ఇసుక తిన్నెలు, దేవస్థానం ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లు కూడా పక్కాగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఏర్పాట్లు పరిశీలన అనంతరం శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు, దేవస్థానం ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరబద్రరావు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికి, పూజా కార్యక్రమాలు చేయించారు. ఈయన వెంట డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల రావమ్మా.. అనుగ్రహించమ్మా



కనసానపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్రభ వాహనం, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు (ఇన్‌సెట్‌లో)

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి, ఆగిరిపల్లి, కనసానపల్లి గ్రామాల్లో కొలువై ఉన్న దుగ్గిరాల బాల రావమ్మ తల్లి మాఘ పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం తోటపల్లిలో మంత్రి కొలుసు పార్థసారథి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారికి విశేష పూజలు, పులంగి సేవను అర్చకులు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఈవో సాయి తెలిపారు. మూడు గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ధ్వజ స్తంభాల వద్ద పాలపొంగళ్లు సమర్పించారు. ఆగిరిపల్లి, కనసానపల్లి తోటపల్లిలో సంతానం కలగాలని మహిళా భక్తులు ప్రాణాచారం పట్టారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కనసానపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభ వాహనం పలువురిని ఆకర్షించింది. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై శుభ శేఖర్, సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

- ఎస్పీ ప్రతాప్ శివకిషోర్
- డ్రైవర్లకు అవార్డుల అందజేత



ఎస్పీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ డ్రైవర్ బి.పాపారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని, తమ చేతిలో దాదాపు 60 కుటుంబాల భవిష్యత్ ఉందనే విషయాన్ని ప్రతి నిమిషం గుర్తు చేసుకోవాలని ఎస్పీ కే.ప్రతాప్ శివకిషోర్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లకు విధి నిర్వహణలో ప్రయాణికుల భద్రత ఒక్కటే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. దీనితో పాటు ఆర్టీసీ డ్రైవర్లు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రమాదాలు తక్కువగా జరిగాయన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు ఎస్పీ చేతుల మీదుగా అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బీ.వాణి, నూజివీడు డిపో మేనేజర్ పవన్ కుమార్, జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్, మూడు డిపోల ఏఎంటీలు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, పీఆర్ఓ కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్లు వీరే..

జిల్లా స్థాయిలో నూజివీడు డిపోకు చెందిన బీ పాపారావు, ఏలూరు డిపోకు చెందిన జే చెల్లయ్య, బీకే రెడ్డి, ఏలూరు డిపో స్థాయిలో ఆర్‌వీ రావు, పీవీవీవీ రావు, డీఆర్ కృష్ణ, జంగారెడ్డిగూడెం డిపో స్థాయిలో డీవీఎస్ఎన్‌టీ రాజు, ఎం. చిన్నయ్య, ఎంబీ రావు, నూజివీడు డిపో స్థాయిలో డీవీకే రావు, బీవీ రావు, కేఆర్ కృష్ణ అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



తాడేపల్లిగూడెంలో కారులో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

తాడేపల్లిగూడెం: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావుకు చెందిన కారు మంగళవారం రాత్రి దగ్ధమైంది. ఫైర్ ఆఫీసర్ జీవీరావు బుధవారం తెలిపిన వివరాలివి. పట్టణంలోని పోలీసు స్టేషన్ వెనుక, ఎండీఓ కార్యాలయం సమీపంలో పార్కు చేసిన కారు షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఈమేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభావతి ఆగడాలపై సబ్‌కలెక్టర్ విచారణ

నూజివీడు: నూజివీడు మండలం మర్రిబంధం, సీతారామపురం గ్రామాలకు చెందిన పలువురిపై గత కొంతకాలంగా బెదిరింపులు, దౌర్జన్యాలకు దిగుతున్న దావులూరి ప్రభావతిపై నూజివీడు సబ్‌కలెక్టర్ బీ స్మరణ్ రాజ్ విచారణ చేపట్టారు. ప్రభావతి బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ అవకతవకలకు పాల్పడి సస్పెండ్‌కు గురికావడం, అనంతరం పలువురిని మోసం చేసి పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదు కావడంతో నూజివీడు పోలీసులు ప్రభావతిపై రౌడీ షీట్ ఓపెన్ చేశారు. ప్రభావతి ఆగడాలను తట్టుకోలేక గ్రామ ప్రజలు పలుమార్లు ఏలూరు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు. మర్రిబంధంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ప్రజలను భయాబ్రాంతులకు గురి చేస్తున్న ప్రభావతి నుంచి తమకు రక్షణ కావాలని కోరుతున్న బాధితుల గోడుపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ప్రభావతితో పాటు ఆమె కుటుంబ సభ్యులను బైండోవర్ నిమిత్తం కలెక్టర్ ఆదేశాల ప్రకారం నూజివీడు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సమన్లు జారీ చేశారు. సమన్లకు సమాధానం ఇచ్చేందుకు ప్రభావతికి రెండు రోజుల గడువు ఇచ్చారు.

తాళం వేసిన ఇంట్లో ప్లంబింగ్ మెటీరియల్ చోరీ

తణుకు అర్బన్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి ట్యాప్‌లు, ప్లంబింగ్ మెటీరియల్ చోరీ చేసిన ఘటన తణుకులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎన్జీవో కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన గృహంలో ముఖద్వారాన్ని గడ్డపారలతో పెకలించి ధ్వంసం చేసి దొంగలు లోపలకు ప్రవేశించినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న ఇంట్లో టాయిలెట్స్, వంటగది, వాష్ ఏరియాల్లో ఉన్న ఖరీదైన జాగ్వార్ కంపెనీకి చెందిన ఎస్ఎస్ ట్యాప్‌లు దొంగిలించుకుపోయారు. నిర్మాణానికి సంబంధించి చివరిస్థాయి పనులు జరుగుతున్న నేపథ్యంలో దొంగలు సుమారు రూ.4 లక్షలు విలువైన టేకు ముఖద్వారాన్ని ధ్వంసం చేసి లాక్‌తోపాటు హ్యాండిల్స్, ట్యాప్‌లు దోచుకుపోయినట్లు ఇంటి యజమాని సత్య వీరమళ్ల తెలిపారు. బుధవారం ఉదయం బిల్డర్ కిరణ్ వచ్చి చూసేటప్పటికీ తలుపులు తెరిచి ఉండడం, సామాగ్రి లేకపోవడంతో యజమానికి తెలపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

నూజివీడు: పశువుల కాపరి చెరువులో మునిగి మృతి చెందాడు. వివరాల ప్రకారం దేవరగుంటకు చెందిన పలగాని కృపారావు (49) గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో గ్రామానికి సమీపంలోని కోతులగుంట చెరువులోకి గేదెలు దిగి నీళ్లలో పడుకొని ఎంతసేపటికి పైకి రావడం లేదు. దీంతో వాటిని పైకి తోలేందుకు కృపారావు చెరువులోకి దిగి మునిగిపోయి మృతిచెందాడు. సమీపంలోనే ఉన్న ఇతర గేదెల కాపరులు చూసి గ్రామంలోని వారికి సమాచారం అందించారు. వెంటనే గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ ఎస్సై ఎన్ లక్ష్మణ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువల్లో కోళ్ల మూటలు

- చనిపోయిన కోళ్లను మూటలు కట్టి కాలువల్లో వేస్తున్న వైనం
- అదే నీటిని ఆక్వా చెరువులకు వాడుతున్న రైతులు
- వైరస్‌తో కలుషితమైన నీటితో ఆక్వాకు నష్టమంటున్న శాస్త్రవేత్తలు
- కాలువల్లో వేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకోలు



భీమవరం వద్ద జీలండ్‌వీ కెనాల్‌లో చనిపోయిన కోళ్లు



పాలకోడేరు మండలం మైప గ్రామం వద్ద కాలువలో కోళ్ల మూటలు

భీమవరం : కోళ్లలో బర్డ్‌ఫ్లూ వ్యాధి ఆక్వా రైతులను వణికిస్తోంది. పౌల్ట్రీల్లో కోళ్ల మరణాలకు ఎవియన్ ఇన్‌ఫ్లూయంజ్ కారణమని నిర్ధారించగా, చనిపోయిన కోళ్లను పెద్ద సంఖ్యలో పంట, మురుగు కాలువల్లో వేస్తున్నారు. వైరస్‌తో కలుషితమైన ఆ నీరు రొయ్యలు, చేపల చెరువులకు చేరి ఆక్వాకు తీవ్రమైన నష్టం ఏర్పడుతుందని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనవరిలోనే వైరస్ కారణంగా కోళ్లు చనిపోతుండగా రెండు రోజుల క్రితమే బర్డ్‌ఫ్లూగా గుర్తించారు. సంక్రాంతి కోడిపందేలకు సిద్ధం చేస్తున్న కోడి పుంజులు జనవరిలో చనిపోవడం నాటుకోళ్ల పెంపకందారుల్లో ఆందోళన వ్యక్తమైంది. తరువాత పౌల్ట్రీలోని బ్రాయిలర్, లేయర్‌కోళ్లు చనిపోయాయి. ఇటీవల కోళ్లు పెద్దసంఖ్యలో చనిపోవడంతో కోళ్లఫారాల యజమానులు వాటిని సంచుల్లో మూటలుగా కట్టి పంట, మురుగు కాలువల్లో పడేయడం ప్రారంభించారు. అయితే వాటిని ఆక్వా రైతులు పెద్దగా పట్టించుకోలేదు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై బర్డ్‌ఫ్లూ నిర్ధారిత కోళ్ల ఫారాల వద్ద ఆంక్షలు విధించారు. అక్కడి నుంచి కోళ్లు, కోడిగుడ్ల విక్రయాలు నిలిపివేశారు. అంతేగాకుండా చనిపోయిన కోళ్లను భూమిలో గొయ్యితీసి పాతిపెట్టాలని అధికారులు సూచించారు. అయినప్పటికీ కొందరు కోళ్లఫారమ్ యజమానులు పూడ్చిపెట్టడం వ్యయప్రయాసలతో కూడినదిగా భావించి చనిపోయిన కోళ్లను సంచుల్లో మూటలు కట్టి కాలువల్లో వేస్తున్నారు.

రొయ్యలు, చేపల చెరువులకు కాలువల నీరే

జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా ఉప్పునీటి కోసం బోర్లు వేస్తున్నా ఎక్కువ మంది రైతులు పంట, మురుగు కాలువల్లోని నీటినే వినియోగిస్తారు. బర్డ్‌ఫ్లూ కారణంగా చనిపోయిన కోళ్లు కాలువల్లో వేయడం వల్ల వైరస్ నీటిలో కలసి చేపలు, రొయ్యలకు కూడా తెగుళ్లు వ్యాపించే ప్రమాదముంది. దానివల్ల చేపలు, రొయ్యలు చనిపోతే ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతారు.

ఆక్వాకు నష్టం



బర్డ్‌ఫ్లూతో చనిపోయిన కోళ్లు కాలువల్లో వేస్తే అటువంటి నీటిని ఆక్వా చెరువులకు వినియోగించకూడదు. ఆక్వా రైతులు ఎవరైనా ఆ నీటిని వినియోగిస్తే ముందు జాగ్రత్తగా 25 కిలోల లైమ్, 5 శాతం గ్రోమిన్ మందును లీటరు నీటిలో కలిసి ఎకరం విస్తీర్ణంలోని చెరువులో వేయాలి. చెరువుల్లోని నీరు కలుషితంపై నీటి పరీక్షలు చేయించుకోవాలి.

– ఎ.శ్రీనివాస్, మత్స్యపరిశోధన సీనియర్ శాస్త్రవేత్త, ఉండి కేవీకే

చర్యలు తీసుకోవాలి



ఇటీవల బర్డ్‌ఫ్లూ వ్యాధితో చనిపోతున్న కోళ్లను ఎక్కువగా సంచుల్లో మూటలు కట్టి మురుగు, పంట కాలువల్లో వేస్తున్నారు. ఆక్వా రైతులు ఆ నీటిని వినియోగిస్తే రొయ్యలు, చేపలకు వైరస్ సోకి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. చనిపోయిన కోళ్లను కాలువల్లో వేయకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

– గాదిరాజు వెంకట సుబ్బరాజు, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, భీమవరం

క్లుప్తంగా

వర్మీ కంపోస్టు తయారీని వేగవంతం చేయాలి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: వర్మీకంపోస్టు తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ అన్నారు. బుధవారం మండలంలోని కొమ్ముగూడెం, వీరంపాలెం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తలను వేరు చేసి నాడెప్ పిట్‌లో వేసి వర్మీకం పోస్టు తయారు చేసే ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి బేబి, కార్యదర్శులు వి.వాణి, రఘు, నాయకులు చంద్రారెడ్డి, తాడేపల్లి శ్రీనివాస్, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఇంటింటికి తిరిగి పరిసరాలను పరిశీలిస్తున్న మలేరియా అధికారి లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడారు. ఆరోగ్య విస్తరణాధికారి కే.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే దోమలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త విమల, ఎంఎల్‌హెచ్‌పీ బాలాజీ, అంగన్‌వాడీ కార్యకర్త రత్నకుమారి, ఆశాలు స్వరూప, దుర్గ, కమల, ఆరోగ్య సహాయకులు కాంతారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు విశేష పూజలు



విశేష అలంకరణలో వాసవీ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం వాసవీ అమ్మవారికి పంచామృతాలతో, సుగంధద్రవ్యాలు, ఫలరసాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలయ సెక్రటరీ ఆలపాటి కృష్ణ కుమార్, పూర్వాధ్యక్షుడు పేరూరి కాశయ్య, భక్తులు పాల్గొన్నారు.

జేఈఈలో శశి విద్యార్థుల ప్రతిభ






ఉత్తమ పర్సంటైల్ సాధించిన శశి విద్యార్థులు

తాడేపల్లిగూడెం: జేఈఈ మెయిన్స్ 25 సెషన్ వన్ ఫలితాల్లో పట్టణంలోని శశి విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ సాధించారని సంస్థ అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ బుధవారం తెలిపారు. పి.ప్రశాంతి 97.93 పర్సంటైల్, కె.దేవిక 97.38, పి.రోహిత్ 97.06, ఎస్‌కె.అజామ్‌ఖాన్ 96–02, ఎ.ఎన్‌వి, ఎస్ఎస్.ప్రసాద్ 94.89. డి.జశ్వంత్ 94.23, కె.జశ్వంత్ 94.09 పర్సంటైల్ సాధించారన్నారు. 90కి పైగా పర్సంటైల్‌ను 14 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ విజయాన్ని అందించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, గోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ క్రాంతిసుధలు అభినందనలు తెలిపారు.

విప్పర్రులో మహిళ అదృశ్యం

పెంటపాడు: విప్పర్రు గ్రామంలో ఒక మహిళ కొద్దిరోజులుగా కనిపించడం లేదని బంధువుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పెంటపాడు ఎస్ఐ స్వామి తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు.

రోడ్లపై మురుగునీరు..!

- క్రమబద్ధీకరణకు నోచుకోని డ్రెయినేజీలు
- మురుగు నీటిపై దోమల ఆవాసాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



లింగారాయుడిగూడెం గ్రామంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

తాడేపల్లిగూడెం రూరల్: ఏ గ్రామం చూసినా ఏమున్నది గర్వకారణం.. పక్కా డ్రెయినేజీలు లేక రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు. ఆపై మురుగు నీటిపై ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్న దోమల దృశ్యాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని లింగారాయుడిగూడెం, దండగర్ర, మెట్ట ఉప్పరగూడెం, ఎల్. అగ్రహారం, మోదుగ గుంట, జగన్నాథపురం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇళ్లల్లోని వాడకం నీరు, మురుగు నీరు ఏకమై రోడ్లపై ప్రవహించడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం కచ్చా డ్రెయినేజీలను తీసే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో మురుగు నీటికి దోమల ఉధృతి పెరిగి రాత్రి సమయాల్లో ముప్పేట దాడి చేస్తున్నాయని, తద్వారా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దోమల ఉధృతికి కంటిపై కునుకు లేకుండా పోతుందంటున్నారు. దోమల బాధ భరించలేక కొమ్ముగూడెం, నీలాద్రిపురం తదితర గ్రామాల్లో అరుబయట రచ్చబండ వద్ద పిచ్చాపాటీ మాట్లాడుకునే వారు సైతం దోమ తెరలను వినియోగించడం గమనార్హం. దీన్ని బట్టి దోమల ఉధృతి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో డ్రెయినేజీ దుస్థితి



ఎల్.అగ్రహారం గ్రామంలో మురుగు నీటిపై తేలియాడుతున్న దోమలు

కంటిపై కునుకు ఉండడం లేదు



లింగారాయుడిగూడెం గ్రామంలో ఏడాదిలో 365 రోజులు రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుంది. అవుట్ లెట్ లేకపోవడంతో మురుగు నీరు పోయే మార్గం లేదు. దీంతో ఆరుబయట కూర్చోలేని పరిస్థితి. రాత్రి సమయాల్లో కంటిపై కునుకు ఉండడం లేదు. దోమల నివారణ చర్యలు చేపట్టాలి.

– దాసరి రాముడు, లింగారాయుడిగూడెం, తాడేపల్లిగూడెం మండలం

దోమలతోనే సావాసం



నిత్యం పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు కుట్టి చంపుతున్నాయి. ఒంటిపై దద్దుర్లు వచ్చి చాలాసేపటివరకు దురదలు తగ్గడంలేదు. దోమల ఉధృతికి ఏ వ్యాధులు వస్తాయోనని భయంగాఉంది. అధికారులు చర్యలు చేపట్టాలి.

– మిద్దే చంద్రమ్మ, లింగారాయుడిగూడెం, తాడేపల్లిగూడెం మండలం

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు



వేల్పూరు రోడ్డులోని హోటల్‌లో గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న తహసీల్దార్ అశోక్‌వర్మ

తణుకు అర్బన్: గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపారాల నిమిత్తం కమర్షియల్‌గా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు తహసీల్దార్ దండు అశోక్‌వర్మ హెచ్చరించారు. తణుకు పట్టణంలో బుధవారం అక్రమమార్గంలో వినియోగిస్తున్న హోటల్స్‌పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు వేల్పూరు రోడ్డులోని సీజనల్ స్టోర్స్‌లో గృహ అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లను వినియోగించడాన్ని ఆకస్మిక తనిఖీల్లో పట్టుకున్నారు. హోటల్‌లో 6 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. హోటల్స్, కర్రీపాయింట్స్, స్వీట్స్‌స్టాల్స్‌లో వాణిజ్య అవసరాలకు సంబంధించిన సిలిండర్లను మాత్రమే వినియోగించాలని, నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి




సిబ్బందికి స్టీల్ బాటిళ్లను పంపిణీ చేసిన కమిషనర్

తాడేపల్లిగూడెం: ప్లాస్టిక్ నిషేధానికి అధికార్లు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది స్టీల్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు, కొనుగోలుదారులు ప్లాస్టిక్‌ను వినియోగిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఇకపై మున్సిపల్ ఉద్యోగులు కూడా ప్లాస్టిక్ బాటిళ్ల వాడకాన్ని మాని, స్టీల్ బాటిళ్లు వినియోగించనున్నారని కమిషనర్ తెలిపారు.

● దారంతా మంచు తెరలు



ప్రత్తిపాడు, రాచర్ల, అలంపురం ప్రాంతాల్లో హైవేపై మంచుదట్టంగా ఉన్న దృశ్యాలు



తాడేపల్లిగూడెం-భీమవరం రహదారుల్లో కమ్మేసిన పొగ మంచు బుధవారం ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. దీంతో రహదారులపై ప్రయాణించేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచు కురిసిన సమయంలో తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు విజయవాడ రహదారుల్లో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దారి కనబడనంతగా మంచు కురవడంతో వాహనదారులు వాహనాల హెడ్‌లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. - పెంటపాడు

నేడు యూపీఏ సర్వసభ్య సమావేశం

పెంటపాడు: గూడెం కొండాయిచెరువు ఫెయిత్ చర్చిలో ఈనెల 13న యునైటెడ్ పాస్టర్ అసోషియేషన్ (యుపీఏ) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశానికి పెంటపాడు, గూడెం మండల, పట్టణ యూపీఏ నాయకులు, సభ్యులు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు అలంపురానికి ప్రత్యేక వైద్యులు రాక

పెంటపాడు: ఈనెల 13న అలంపురం వెంకటరమణచార్యీ ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, అంకాలజీ, ఐవీఎఫ్‌తో పాటు, గైనాకాలజీ, పిడ్రియాట్రిక్ వైద్యులు వచ్చి రోగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 13న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించబోయే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సలహాలు ఇవ్వండి

తాడేపల్లిగూడెం: డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ ఆదేశాల ప్రకారం పట్టణంలోని కంజస్టడ్ ఏరియా 8,18,19,24,27,29 వార్డులకు తయారు చేసిన సర్క్యులేషన్ ప్యాట్రన్‌ను ఆమోదించినట్టు కమిషనర్ ఎం.ఏసుబాబు బుధవారం తెలిపారు. ఈ విషయంపై ఆయా వార్డుల్లో ఉన్న ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఏడు రోజుల్లోగా సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు మునిసిపల్ కార్యాలయం, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో నోటిసులను చూసుకోవాలన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్థానిక పండ్ల వర్తకసంఘం జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) వార్షికోత్సవం బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శ్రీను అధ్యక్షతన జరిగింది. ప్రజా నాట్యమండలి వారిచే విప్లవ గీతాలు ఆలపించారు. మద్దూరి ఆనంద్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. 2024 సంవత్సరం కార్యకలాపాల నివేదికను కార్యదర్శి ప్రసాద్ ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు నివేదికను ఆమోదించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, మడకా రాజు, కరెడ్ల రామకృష్ణలు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా జవ్వాది శ్రీను, ఉపాధ్యక్షుడిగా తట్టాగొట్టి పెద్దిరాజు, కార్యదర్శి కాయల ప్రసాద్, సహాయ కార్యదర్శిగా సారిక శ్రీను, కోశాధికారిగా పుట్టా యేసు, కమాండర్‌గా మద్దూరి ఆనంద్, కమిటీ సభ్యులుగా సువ్వాడ రాంపండు, సుంకర శ్రీను, బాసంశెట్టి శ్రీను, రెండోవ కమాండర్‌గా సువ్వాడ చిన్న సన్యాసిరావులు ఎన్నికయ్యారు. కార్మికులు, యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో భావితరాలకు మేలు

ఆర్డీవో కౌసర్ బనో



ఆరుగొలను గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో

తాడేపల్లిగూడెం రూరల్: సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో అన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సోలార్ రూఫ్ టాప్‌పై బుధవారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కౌసర్ బనో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంతో పాటు బ్యాంకు రుణ సదుపాయం కలిస్తుందన్నారు. ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఎలక్ట్రికల్ ఏడీఈ బి.రామకృష్ణ, ఏఈ అల్లు రామకృష్ణ, సర్పంచ్‌లు పీతల బుచ్చిబాబు, కే.హనుమంతు, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీర రాఘవులను గెలిపించాలంటూ ప్రచారం



పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ఇరగవరం: పీడీఎఫ్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపించాలంటూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీప్రతాప్ పిలుపునిచ్చారు. ఇరగవరంలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, వివిధ అంశాలపై చర్చించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. కామన మునిస్వామి అధ్యక్షత వహించారు. ప్రతాప్ మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసం అలుపు లేకుండా గత 35 సంవత్సరాలుగా పనిచేస్తున్న వీర రాఘవులు గెలిపించడం అందరి బాధ్యత అని తెలిపారు. పేద, మధ్యతరగతి తరుపున పనిచేయుటకు ముందుకు వచ్చిన వ్యక్తి వీర రాఘువులు అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం



వ్యవస్థాపక దినోత్సవంలో ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ ఉద్యోగులు (1104) యూనియన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు బుధవారం జువ్వలపాలెంలో విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యాలయం సమీపంలోని బస్ స్టాప్ వద్ద జెండా వందనం చేశారు. వక్తలు మాట్లాడుతూ యూనియన్ 76 వసంతంలోకి అడుగు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పి.సుబ్రహ్మణ్యం, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ జొన్నాడ శ్రీనివాస్, జిల్లా అసిస్టెంట్ రొక్కలా రవి కుమార్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైఆర్‌డీ ప్రసాద్, డివిజన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేశవస్వామికి పుష్పయాగోత్సవం

తణుకు అర్బన్: భీష్మ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామికి పుష్ప యాగోత్సవ కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణముల మధ్య ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతులు పీటలపై కూర్చుని పుష్పయాగోత్సవాన్ని శాస్త్రోక్తకంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయ ఆవరణలో పల్లకీలో ఊరేగించారు. ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ పూజాధికాలను పర్యవేక్షించారు.



కేశవస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పౌల్ట్రీ రంగాన్ని కుదిపేస్తున్న వైరస్

- వ్యాధితో చనిపోతున్న కోళ్లు
- చికెన్ విక్రయాలు నిషేధం
- నేడు కోళ్లను పూడ్చిపెట్టేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు



తణుకులో మూతపడ్డ చికెన్ దుకాణం

తణుకు అర్బన్: కొక్కొరొక్కో అంటూ అందరినీ నిద్రలేపే కోళ్లు...తెలవారే సరికి చనిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు కోకొల్లలు జరుగుతున్నాయి. తణుకు మండలం వేల్పూరులో బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ కావడంతో తణుకు అధికారులు రక్షణ చర్యలు విస్తృతంగా చేపట్టారు. రెడ్‌జోన్‌గా ప్రకటించిన వేల్పూరు కృష్ణానందం కోళ్ల ఫారమ్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ముఖ్యంగా కోళ్ల ఫారమ్‌ల నుంచి కోళ్లు బయటకు తీసుకువెళ్లకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఆ ప్రాంతంపై ఆంక్షలు విధించారు. బుధవారం రెడ్ జోన్ ప్రాంతంలో తహసీల్దార్ దండు అశోక్ వర్మ, తణుకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ శంకర్ భావన్నారాయణ తమ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌జోన్‌గా నిర్దేశింపబడిన ప్రాంతంలో మొత్తం 5 కోళ్ల ఫారమ్‌లు ఉన్నాయని, ఆ ఫారాల్లో ఉన్న కోళ్లను గురువారం ఉదయం శాస్త్రీయ పద్ధతిలో చంపి పూడ్చిపెట్టే పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పది ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు వస్తున్నాయని ఒక్కో టీంలో ఆరుగురు చొప్పున ఉంటారన్నారు. వీరు ఫారాల్లోకి వెళ్లే ముందు యాంటీవైరల్ మందులు ఇచ్చి ప్రత్యేక పీపీ కిట్‌లు ధరింపచేసి లోపలకు పంపిస్తామని స్పష్టం చేశారు. కోళ్లను గొయ్యితీసి పాతిపెట్టి బ్లీచింగ్, సున్నం చల్లిస్తామని, మూడు నెలలపాటు ఫారమ్‌లను సీజ్ చేస్తామని చెప్పారు.

కోళ్లు తరలించేశారా..?

అయితే రెడ్‌జోన్‌లో ఉన్న కోళ్లను ఇప్పటికే వ్యాన్‌లలో ఎక్కించి విక్రయాలకు తరలించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రెడ్‌జోన్‌లోని ఫారాల్లో ఉన్న కోళ్లు ఏ ప్రాంతాలకు వెళ్లాయి, మళ్లీ ఆ ప్రాంతాల్లో ఏ ఇబ్బంది వస్తుందోనని ప్రజానీకంతోపాటు అధికారులు సైతం తలలుపట్టుకుంటున్నారు.

మూతపడ్డ చికెన్ దుకాణాలు..

రెడ్‌జోన్‌గా ఉన్న వేల్పూరుతోపాటు అలర్ట్ జోన్‌గా ఉన్న తణుకు, కొమరవరం, అత్తిలి, కావలిపురం, గోటేరు, మండపాక, ఇరగవరం, తేతలి, రేలంగి, గుమ్మంపాడు, పాలి, వరిగేడు, బల్లిపాడు, తణుకు, అర్జునుడుపాలెం చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. కోడిగ్రుడ్ల అమ్మకాలు నిలిపివేశారు. ముఖ్యంగా అధికారులు ఇచ్చిన నోటీసుల ప్రకారం తణుకులో చికెన్ రిటైల్ అమ్మకాలు చేసే దుకాణాలు మంగళవారం మధ్యాహ్నం నుంచే మూతపడ్డాయి. ప్రజానీకం కూడా చికెన్ కొనుగోలు చేయాలంటే భయపడుతున్న పరిస్థితుల్లో అమ్మకాలు కూడా లేవని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్ ఆధారంగా నడిచే హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ పకోడి బళ్లు సైతం మూలకుచేరాయి.



వేల్పూరు రెడ్ జోన్ ప్రాంతంలో పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్‌వర్మ, పశువైద్యాధికారి డాక్టర్ శంకర్ భావన్నారాయణ